# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 05 జులై, 2026 | పేజీలు :08


## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శణీయం: కలెక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని ఆయన పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సామాజిక న్యాయంకోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, వివిధ శాఖల అధికారులు తదితరులు కురుమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా
# ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

### మూడపల్లిలో మెగా గురుకులానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/చందుర్తి :** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు మూడపల్లి బస్ స్టాండ్ నుండి భారీ ర్యాలీతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రూ. 200 కోట్లతో, 2600 మంది విద్యార్థులకు వసతితో కూడిన నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని, దీనిని 16 నుండి 18 నెలల్లోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ స్కూల్ వేములవాడ నియోజకవర్గానికే మణిహారంగా నిలుస్తుందని, ఇందుకు భూమిని అందించిన దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువస్తోందని, హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొన్ననే ఆరుట్లలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీనిని ప్రారంభించుకున్నామని, త్వరలోనే వేములవాడ నియోజకవర్గానికి కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందిస్తున్నామని, గురుకుల విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచినట్లు గుర్తుచేశారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, త్వరలోనే రుద్రంగి మండల కేంద్రంలో ఏటీసీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. గత పది సంవత్సరాలుగా పడకేసిన పనులన్నీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో వేగంగా ముందుకు సాగుతున్నాయని అది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను ఆనాడు దేనికోసమైతే పోరాడారో, అందులో 95 శాతం పనులను పూర్తి చేశానని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో రూ. 1000 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం నేతన్నలకు పెట్టిన రూ. 300 కోట్ల బకాయిలను విడుదల చేయడమే కాకుండా, తాజాగా కోటి చీరల ఆర్డర్‌ను కూడా అందించామని స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిని గత ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం చేసి తప్పిదాలు చేసిందని విమర్శించారు. తాము రాజన్న ఆలయాన్ని రూ. 150 కోట్లతో, శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు ఆగమశాస్త్రం ప్రకారం పాత ఆలయాన్ని ఏమాత్రం మార్చకుండా విస్తరిస్తున్నామని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో 50 ఏళ్లుగా జరగని రోడ్డు విస్తరణ పనులు ఇప్పుడు శరవేగంగా జరుగుతున్నాయని.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో ఆనాడు డబుల్ రోడ్డు నిర్మాణం జరిగితే, ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలో వేములవాడ నుండి సిరికొండ వరకు 3 లైన్ల రోడ్డు మంజూరైందని తెలిపారు. త్వరలోనే చందుర్తి – మోత్కూరావు పేట రోడ్డుకు భూమి పూజ చేస్తామని, కొనరావుపేట మండల పరిధిలో బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు పనులు కూడా వేగంగా సాగుతున్నాయన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలోనే ఆయన ముంపు గ్రామాల్లో బస చేసి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడుతూ.. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా జరిగిందని, గతంలో కంటే లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎక్కువగా సేకరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మర్రిపల్లిలో 40 ఎకరాల స్థలంలో రూపుదిద్దుకోబోతున్న రైతు విజ్ఞాన కేంద్రం రైతులకు భూసార పరీక్షలు చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ వివరించారు.

## పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ



రేషన్ షాపుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

**ప్రజాపక్షం/మానకొండూర్:** ప్రజలకు నిత్యావసర వస్తువుల పంపిణీలో ఏలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా పని చేసేలా ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టామని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మానకొండూర్ మండలం మానకొండూర్, అన్నారం, పచ్చునూర్ గ్రామాల్లో చౌకధరల దుకాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి అర్హులైన లబ్దిదారునికి రేషన్ సరుకులు అందించడమే కాకుండా సరుకుల పంపిణీలో ఏలాంటి అవకతవకలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాల ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. రేషన్ దుకాణాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని సంబంధిత డీలర్లకు సూచించారు. ప్రజలకు నిర్ణీత సమయంలో నాణ్యమైన బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు, బందెల మహేందర్ , పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బెల్లం పొడి ప్యాకెట్ల తనిఖీకి
# ఎంఇఓ అత్యవసర ఆదేశాలు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న కొన్ని బెల్లం పొడి ప్యాకెట్ల గడువు ముగిసినట్లు వచ్చిన ప్రజాపక్షం దినపత్రికలో శనివారం ప్రభుత్వ పాఠశాలలకు కాలం చెల్లిన బెల్లం పొడి సరఫరా.? అనే వార్త కథనం ప్రచురితమైన వార్త కథనానికి మండల విద్యాధికారి స్పందించారు. శనివారంముత్తారం మండల విద్యాధికారి హరిప్రసాద్ అత్యవసర ఆదేశాలు జారీ చేశారు.విద్యార్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**గడువు తేదీల తనిఖీ :** పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ తయారు చేసే ముందు, సరఫరా చేసిన రాగిజావ, బెల్లం పొడి ప్యాకెట్ల గడువు తేదీలను విధిగా తనిఖీ చేయాలి.

**వెంటనే నివేదించడం :** గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ప్యాకెట్లు ఉంటే వాటిని వెంటనే వేరు చేయాలి. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకుండా, వెంటనే ఎంఈఓ కార్యాలయానికి నివేదించాలి.

**ప్రధానోపాధ్యాయులదే బాధ్యత :** ముందస్తు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా విద్యార్థులకు పంపిణీ చేస్తే, తదుపరి జరిగే పరిణామాలకు, విద్యార్థుల ఆరోగ్య సమస్యలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంఈఓ హెచ్చరించారు.

## విద్యారంగంపై అవగాహన లేని సిఎం రేవంత్ రెడ్డి



# సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/రామడుగు :** జాతీయ వ్యవసాయం ప్రకృతి మిషన్ పథకం ద్వారా మండలంలోని శానగర్ గ్రామ రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గునుకొండ శైలజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వ్యవసాయ డాట్ మిషన్ సెంటర్ శాస్త్రవేత్తలు మధుకర్, సాయికుమార్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వారికి సేంద్రీయ వ్యవసాయం చేయు విధానం, సేంద్రీయ వ్యవసాయంపై జరిగే లాభాల గురించి రైతులకు వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల భూసారం దెబ్బతిని భూమి సహజత్వాన్ని కోల్పోతుందని దీంతో రాబోయే తరంలో పంటలు పండవని వివరించారు. సహజసిద్ధంగా లభించే చెట్ల ద్వారా కషాయాలు తయారు చేసుకోని పంటలకు పిచికారి చేయాలని సూచించారు. కషాయాలు తయారు చేయు విధానాలను రైతులకు తెలిపారు. గ్రామంలో ఉత్సాహం గల రైతులు జాతీయ ప్రకృతి మిషన్ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయం చేయడానికి శాస్త్రవేత్తలు అధికారులు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.ప్రభావతి,వ్యవసాయ విస్తీర్ణ అధికారి అర్చన, మాజీ సర్పంచులు సైన్ల నర్సింగం, గునుకొండ అశోక్ కుమార్, ఉప సర్పంచ్ చిరుత అంజయ్య, పంచాయతీ కార్యదర్శి పున్న మధుసూదన్, కృషిసఖి పోలు మల్లీశ్వరి, రైతులు ఎడ్ల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం రోశయ్య జయంతి వేడుకలు

**ప్రజాపక్షం / జమ్మికుంట :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకొని శనివారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కర్ణాటక, తమిళనాడు మాజీ గవర్నర్ గా పని చేశారని 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక నాయకుడు అని అన్నారు. రోశయ్య జయంతి కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన సహకార సంఘం చైర్మన్‌లు

**ప్రజాపక్షం / శంకరపట్నం :** శంకరపట్నం మండలంలోని 3 సహకార సంఘం చైర్మన్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని గద్దపాక సహకార సంఘం చైర్మన్‌గా గోపగోని బసవయ్య గౌడ్, మెట్టుపల్లి సహకార సంఘం చైర్మన్ గా గాజుల మహేశ్ గౌడ్, తాడికల్ సహకార సంఘం చైర్మన్ గా కీసర సంపత్ ముదిరాజ్‌లు బాధ్యతలు స్వీకరించారు. వీరితోపాటు సంఘంలో 12 మంది డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సంఘాల చైర్మన్లు మాట్లాడుతూ ప్రాథమిక సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు నిత్యం అందుబాటులో ఉంటూ పారదర్శకతతో పని చేస్తూ జవాబుదారీతనంతో ఉంటామని పేర్కొన్నారు.

## 8న అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బి.సి. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధించడానికి అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే ఎడ్యుకేషనల్ సొసైటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాల ద్వారా పిజిటి, టిజిటి, ఇంగ్లీష్ బయో సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, సోషల్, జువాలజీ, కామర్స్, కెమిస్ట్రీ, సివిక్స్, బోటనీ, ఎకనామిక్స్, బిఎస్సి నర్సింగ్, సబ్జెక్టులకు బోధించడానికి అర్హులైన మహిళ అభ్యర్థులు పీజీ, బీఎడ్ పూర్తి చేసి ఉండాలని, మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 08న ఉదయం 10 గంటలకు తిమ్మాపూర్ మండలంలోని ఎల్.ఎమ్.డి కాలనీలోని జ్యోతిబా పూలే బాలికల పాఠశాలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వానాకాలం పంట కొనుగోళ్లకు 100 రోజుల ముందస్తు ప్రణాళిక




**ప్రజాపక్షం/కరీంనగర్:** రానున్న వానాకాలం పంట కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఇప్పటి నుండే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు శ్యాం ప్రసాద్ లాల్ పేర్కొన్నారు. వానా కాలం పంట కొనుగోళ్లకు 100 రోజుల ముందస్తు ప్రణాళిక, గత ఖరీఫ్ లో సేకరించిన ధాన్యం మిల్లింగ్ తదితర అంశాలపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లతో కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ రానున్న వానాకాలం పంట కొనుగోళ్లకు ఇప్పటినుండి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గత యాసంగిలో మిల్లర్లు, అధికారుల సమన్వయ సహకారంతో రాష్ట్రంలో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వివరించారు. రానున్న వానాకాలం కొనుగోళ్లకు అధికారులు, మిల్లర్లు సమన్వయంతో ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. ఈ వానాకాలంలోనూ 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నామని, ఇందుకు తగినట్టుగా సమాయత్తం అవ్వాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగిసేలోగా వంద శాతం ధాన్యం మిల్లింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సీఎంఆర్ లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి అవసరమైతే మిల్లుల్లో పని గంటలను పెంచి, నిరంతరాయంగా మిల్లింగ్ ప్రక్రియ కొనసాగేలా చూడాలన్నారు. ప్రభుత్వం నుండి ప్రతి మిల్లుకు ఒక మానిటరింగ్ అధికారిని నియమించాలని సూచించారు.

## వింధ్యావాలీ హైస్కూల్‌లో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో శనివారం మెహర్ నగర్ (పాత డి–మార్ట్ సమీపంలో) లోని వింధ్యావాలీ హైస్కూల్ లో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు రోడ్డు నిబంధనలు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, మరియు మైనర్ డ్రైవింగ్ (మైనర్లు వాహనాలు నడపడం) వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. విద్యార్థులు తామే కాకుండా తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు. వయస్సు నిండకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని విద్యార్థులకు స్పష్టం చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన: రోడ్డు గుర్తులు, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు జీబ్రా క్రాసింగ్ ఉపయోగించడంపై అవగాహన కల్పించారు.స్వయం క్రమశిక్షణ: రోడ్డు భద్రత అనేది ఒకరి కోసం కాదు, మన ప్రాణాల రక్షణ కోసమని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పాఠశాల సిబ్బంది ట్రాఫిక్ పోలీసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 5 వేల పోలీస్ పోస్టులతో నిరుద్యోగులను మోసం చేయొద్దు

**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీస్ శాఖలో కేవలం 5,000 పోస్టుల భర్తీకి మాత్రమే అనుమతి ఇవ్వడం తీవ్ర నిరాశ కలిగించే నిర్ణయమని, జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖలో 20 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయని ప్రభుత్వ శాఖల గణాంకాలు చెబుతుంటే కేవలం 5వేల పోస్టులు ఇచ్చి చేతులు దులుపుకోవడం సిగ్గు చేటని, ఈ నోటిఫికేషన్ ను వ్యతిరేకిస్తూ పోలీస్ అభ్యర్థులు ధర్నా నిర్వహిస్తే అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపెల్లి యుగంధర్ అన్నారు. ఈ సందర్బంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపెల్లి యుగంధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ కేవలం 5 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో చట్ట వ్యవస్థను బలోపేతం చేయాలన్నా, ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించాలన్నా, ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరతను తీర్చాలన్నా పెద్ద ఎత్తున నియామకాలు అత్యవసరమన్నారు. వేలాది మంది యువత సంవత్సరాలుగా పోలీస్ ఉద్యోగాల కోసం కఠినంగా శ్రమిస్తూ, శారీరక పరీక్షలు, రాత పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లే విధంగా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. ఒకవైపు రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతుండగా, మరోవైపు ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని పూర్తి స్థాయిలో భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం అన్యాయమని, 20 వేలకుపైగా ఖాళీలు ఉండగా కేవలం 5 వేల పోస్టులతో చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. 2026 మే 1న డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్వయంగా తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ పోలీస్ శాఖలో సుమారు 19 వేల ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. అలాంటప్పుడు ప్రభుత్వం కేవలం 5,000 పోస్టులకు మాత్రమే అనుమతి ఇవ్వడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనన్నారు. డీజీపీ పేర్కొన్న ఖాళీలకు అనుగుణంగా కనీసం 19 వేల నుంచి 20 వేల వరకు పోలీస్ పోస్టులకు వెంటనే రీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని పునః సమీక్షించి పూర్తి స్థాయి నియామకాలకు చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతతో కలిసి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని యుగంధర్ హెచ్చరించారు.

## యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

**ప్రజాపక్షం/రామడుగు:** దేశ ఔన్నత్యాన్ని నలుదిసల చాటి చెప్పిన స్వామి వివేకానంద స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకోని వాటిని సాధించుకోవాలని తహసీల్దార్ దాసరి రాజమల్లు కోరారు. శనివారం స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని వెదిర ఎక్స్‌రోడ్ వద్ద జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్పంచులు వజ్ర సంఘాల నాయకులు, అధికారులు, పుర ప్రముఖులు స్వామి వివేకానంద విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ యువత చెడు ప్రలోభాలకు గురికాకుండా చిన్న వయసు నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని సన్మార్గంలో నడువాలని అన్నారు. స్వామి వివేకానంద కేవలం కొన్ని సంవత్సరాలు మాత్రమే బతికినా నేడు మనం ఆయనను ఆదర్శంగా తీసుకుంటున్నామంటే కారణం ఆయన యొక్క దార్శనికతనే కారణమని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శనిగరపు అంజన్ కుమార్, ఎంపిడివో సంగీ రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి హరీశ్, అంజనీ ప్రసాద్, ఏపీఎం జ్యోతి, ఉప సర్పంచులు రాజిరెడ్డి, కటకం మనీశ్, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్, పంచాయతీ కారోబార్ పన్యాల అశోక్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొడిమ్యాల రాజేశం, నేరెళ్ల మారుతి గౌడ్, యువజన సంఘాల నాయకులు కొలిపాక కమలాకర్, అలువాల శంకర్, జవ్వాజి అజయ్, కొల్లూరి అనిల్, కిరణ్ తేజ, కొలిపాక ప్రవీణ్ గడ్డం అంజయ్య, నల్ల శ్రీనివాస్, కె.కమలాకర్ కొలిపాక కార్తిక్ దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/శంకరపట్నం :** శంకరపట్నం మండలం కేశవపట్నం కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపల్ మాధవి తెలిపారు. ఏడవ తరగతిలో 15 ఖాళీలు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. 7వ తరగతితోపాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## కొత్త ఓటర్ ఫారాలను నింపి బిఎల్ఓలకు అందించండి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** పట్టణంలోని బిఎల్ఏ2 ద్వారా కొన్ని పోలింగ్ బూత్‌లలో పర్యటన చేస్తూ ప్రజలకు నూతన ఓటరుగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని, పాత ఓట్లు ఇక పని చేయవని 2002 సంవత్సరం ఆధారంగా అధికారులు మ్యాపింగ్ చేశారని అట్టి ఓటర్ లిస్టు ఆధారంగా మనకు ఇచ్చిన ఫారాలను నింపి ఫోటో అంటిస్తేనే కొత్త ఓటు వస్తుందని లేదంటే ఓటు రాదని ఈ సమాచారాన్ని అందరూ గ్రహించాలని అప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణకై మనందరము నడుము బిగించినవాల్లమవుతామని బిజేపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ అన్నారు. బిఎల్వోలు బిఎల్ఏ 2లు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కొంతమంది బిఎల్వోలు అధికార పార్టీ నాయకులను అనుసరిస్తూ దొంగ ఓట్ల కోసం ప్రయత్నం చేస్తున్నారని అలాంటివాటిని ముసాయిదా ఓటర్ లిస్టులో తొలగిస్తామని అందుకోసం బిజేపి బిఎల్ఏ 2 పకడ్బందీగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు శివకుమార్, బిఎల్ఏ 2ఎదలాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ దూరవిద్యలో ప్రవేశాలు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ దూరవిద్యలో బిఏ, బికాం, బిఎస్సీ కోర్సులలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయిందని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ ఎస్.ఓ.కుమార్, కోఆర్డినేటర్ డా.కె.రాజేదంద్రులు తెలిపారు. ఈ ప్రవేశాలకు చివరి తేదీ ఆగస్టు 7తో ముగుస్తుందని పేర్కొన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు సమాచారం కోసం 7382 929 775 నంబర్ లో సంప్రదించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో సీటు సాధించిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కుమారుడు

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** చక్కటి విద్యను అభ్యసించడం ద్వారా పుష్కలమైన అవకాశాలు ఉంటాయని సమాజంలో తగిన గుర్తింపు వస్తుందని శ్రీ జగన్నాథ రథ యాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు నరహరి అన్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి నివాసంలో ఆయన కుమారుడు భారతదేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ మాట్లాడారు. ఏకాగ్రత శ్రద్ధతో విజయాలను స్వంతం చేసుకోవచ్చని ఇతరులకు ఆదర్శంగా ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. క్రమం తప్పకుండా విషయాలను నేర్చుకుంటూ వాటిమీద పట్టు సాధించాలని తద్వారా ఎన్నో అవకాశాలు వస్తాయని తెలిపారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లను సాధించడం గొప్ప విషయమని ఐఐఐటి బెంగళూరు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఐఐటి బాంబేకెమికల్ ఇంజనీరింగ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన అన్ని పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన అతను భవిష్యత్‌లో విజయ పరంపరను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా.కెప్టెన్ మధుసూదన్ రెడిడ, కన్న కృష్ణ, డా.ఎల్.రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేశ్ రెడ్డి, కొమరవెల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.



# నిరుపేదల స్వంతింటి కలలను నిజం చేస్తాం

**ప్రజాపక్షం/గంగాధర :** చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి నిరుపేదల స్వంతింటి కళలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం గంగాధర మండలం నారాయణపూర్‌లో ఇందిరమ్మ లబ్దిదారులు చింతల తాడేపు లక్ష్మీ నర్సమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటివరకు అర్హులైన లబ్దిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు మరో 2 వేల ఇండ్లు మంజూరుకు సిద్దంగా ఉన్నాయని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్కటంటే ఒక్క గృహం కూడా కట్టించలేదని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూంల పేరిట కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు. ఇండ్లు రాని పేదలు నిరాశ చెందవద్దని రానున్న రోజుల్లో దశలవారిగా ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేశ్, సర్పంచులు ధీకొండ బాబాలక్ష్మి మధు, చిందం ఆంజనేయులు, బీర్ల ఆనంద్, బాసవేణి శ్రీనివాస్ రెడ్డి, రేండ్ల శ్రీనివాస్, వేములు భాస్కర్ , పడాల రాజన్న తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న రైల్వే రాయితీ పాసుల సౌకర్యాన్ని పునరుద్ధరించి దేశవ్యాప్తంగా అర్హులైన పాత్రికేయులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్‌జెయూ) ప్రతినిధులు శనివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈమేరకు టిఎస్‌జేయూ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదుల వెంకటరమణ ప్రతినిధి బృందం కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోశిస్తున్నారని వార్తల సేకరణ, ప్రజా సమస్యల పరిశీలన, అధికారిక కార్యక్రమాల కవరేజ్ కోసం తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వివరించారు. టిఎస్‌జెయూ ఉపాధ్యక్షులు పడకంటి శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శి గాండ్ల శేఖర్, నాయకులు సుద్దాల భాస్కర్, ఈసీ సభ్యులు చింతం వెంకటేశ్ కేంద్ర మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

# మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి , కొణిజెటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య,కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని , ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తోపాటు రోడ్లు భవనాలు రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్ వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రి గా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ ,బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి,సురేష్ , రవీందర్ నరేష్ కుమార్ నాయుడు,ఇతర జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: తపస్

**ప్రజాపక్షం/ముత్తారం:** పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ముత్తారం మండల అధ్యక్షులు ముదుగంటి సతీష్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి గంధం రమేష్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్రంలోని అన్ని మండలాలలో ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలైన పిఆర్సి అమలు, పెండింగ్ డీఏల ప్రకటన, ఈ కుబేర్ లో పేరుకుపోయిన బిల్లుల కు సత్వరం నిధులు మంజూరు చేయడం, పెన్షనర్లకు అన్ని రకాల పెండింగ్ బిల్లుల కు నిధుల మంజూరు, సిపిఎస్ రద్దు, కేజీబీవీ,మోడల్, గురుకుల ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల సత్వర పరిష్కారం తోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కొరకు సత్వరమే గ్రాంట్ల మంజూరు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ శనివారంతపస్ ముత్తారం మండల శాఖ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేయమైనది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముస్కుల సునీల్ రెడ్డి,రాష్ట్ర బాధ్యులు రాపెల్లి రాజేశ్వర్ రావు,జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్, మండల గౌరవ అధ్యక్షులు నర్సింహారెడ్డి,మండల కోశాధికారి రమేష్ రెడ్డి, ఉపాధ్యాయులు బాలరాజు,విజయ్ కుమార్, కమలాకర్,సంపత్, సమ్మయ్య తో పాటు పాల్గొన్నారు.



# అస్తవ్యస్తం.. అధ్వానం!

**ప్రజాపక్షం/ముత్తారం :** ఒకప్పుడు వాహనాల రాకపోకలతో సాఫీగా సాగిన ప్రధాన సీసీ రోడ్డు.. సర్పంచ్ తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల ఇప్పుడు పూర్తిగా బురదగుంటగా మారిపోయింది.దూరం నుంచి చూస్తే అదొక పెద్ద చెరువులా కనిపిస్తుంది.కానీ దగ్గరకు వెళ్తే గానీ తెలియదు.. అది నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి అని! పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో సర్పంచ్ చోప్పరి సంపత్ చేసిన ఒక వింత ప్రయోగం ఇప్పుడు స్థానికులకు, ప్రయాణికులకు శాపంగా మారింది.పారుపల్లి గ్రామ శివారులోని ఒక వంట పొలంలో ఉన్న ఇసుక మేటల మట్టిని తెచ్చి ఈ రోడ్డుపై పోయించారు.ఈ వ్యవహారంపై 'ప్రజాపక్షం' దినపత్రికలో శుక్రవారం కథనం కూడా ప్రచురితమైంది.బురద గుంటగా మారిన రహదారిమట్టి పోసిన మరుసటి సాయంత్రం వర్షం కురవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. మట్టి కాస్తా కరిగి పెద్ద చెరువులా తయారైంది. దీంతో ఆ దారి గుండా వెళ్తున్న వాహనదారులు ఆ బురద గుంటల్లో దిగబడిపోతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు నడపలేక, నడవలేక నానా అవస్థలు పడుతున్నారు.

సర్పంచ్ తీరుపై గ్రామస్తుల అసహనం : పాడైపోయిన సీసీ రోడ్డు ఉన్నప్పుడైనా ఎలాగోలా దర్జాగా వెళ్లేవాళ్లం. కానీ సర్పంచ్ ఉన్న రోడ్డుపై మట్టి పోయడం" వల్ల ఇప్పుడు అసలు నడవలేని పరిస్థితి తయారైంది అని గ్రామ ప్రజలు సర్పంచ్ తీరుపై తీవ్ర అసహనం,ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సీసీ రోడ్డుపై పోసిన ఆ మట్టిని తక్షణమే తొలగించి తమను ఈ నరకయాతన నుండి ముక్తి ప్రసాదించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# ఆటోను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి దేవాలయం సమీపంలో శనివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సైదాపూర్ మండలం బూడిదిపల్లె గ్రామానికి చెందిన ఓ కుటుంబం హుజురాబాద్ వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆటో నడుపుతున్న వ్యక్తితోపాటు ఆ వ్యక్తి కుటుంబం సభ్యులు ఇద్దరికి గాయాలు అయ్యాయి. గాయపడిన క్షతగాత్రుల ను 108 వాహనంలో హుజురాబాద్ ఆసుపత్రికి తరలించారు. సం ఘటన స్థలానికి బ్లూకోట్ పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

# సరస్వతి శిశుమందిర్ ప్రతిభా పురస్కారాల అందజేత

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది సందర్భంగా రామ భక్తుడైన కొమ్మర చంద్రశేఖర్ రెడ్డి పూర్వ విద్యార్థి సంకల్పించిన నరేంద్రవివేక కేశవమాధవ ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నారు. పురస్కారాలు ప్రతి ఏడాది జూలై 4న స్వతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి దినాలను పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించే సభలో అందజేస్తారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు మొదటి ర్యాంక్ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.1116, రెండవ ర్యాంక్ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.816, మూడవ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.616 లతోపాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు క్లాస్‌లో మొదటి ర్యాంక్ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.2116, రెండవ ర్యాంక్ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.1516, మూడవ ర్యాంక్ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.1316 తోపాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా సిఏ నిరంజన చారి హాజరై మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, కొమ్మెర ప్రవీణ్ కుమార్ రెడ్డి, కోల రామచంద్ర రెడ్డి, కొలుగూరి సదాశివరెడ్డి, దేవలకొండ లక్ష్మ ణ్ మూర్తి, గుగ్గిళ్ల రమేశ్ గుజ్జ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, ప్రధాన ఆచార్యులు మోర రణధీర్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన అవసరం

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.రాజేశ్వర్ అన్నారు. శనివారం తిమ్మాపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిభాపూలే (బాలికల) కళాశాలలో జిల్లాన్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కే.రాణి ఆదేశానుసారం జూనియర్ సివిల్ జడ్జిలు బానోత్ రాజేశ్వర్, దామెర్ల ప్రీతి కళాశాలను సందర్శించి భారత రాజ్యాంగం బాలికలకు కల్పిస్తున్న హక్కులు, విధుల గురించి తెలిపారు. సమాజంలో సమానత్వం గురించి మనల్ని మనం రక్షించోవడానికి ఏర్పాటు చేసుకున్నదే చట్టం అని ఆ చట్టం గురించి తెల్సుకోవాల్సిన బాధ్యత విద్యార్థి దశలో ముఖ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఏ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేశ్, శ్రీపతి భావన, ఎల్ఎండి కాలనీ సిఐ రమేశ్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఐవివై విద్యా సంస్థల్లో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలు

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ సీతారాంపూర్ లోని ఐవివై (సిబిఎస్ఈ) విద్యా సంస్థల్లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రెసిడెంట వైస్ ప్రెసిడెంట్, అకాడమిక్ కల్చరల్, స్పోర్ట్స్, క్రమశిక్షణ, ప్రతినిధులు, హౌస్ కెప్టెన్స్‌ల ఎంపికల కోసం నిర్వహించిన ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి బ్యాలెట్ పద్దతిలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా ఓటు వేయడం విశేషంగా ఆకట్టుకుంది. ఎన్నికల నిర్వహణలో ప్రజాస్వామ్య వ్యవస్థలో అనుసరించే విధానాలను విద్యార్థులకు ప్రత్యేక్షంగా పరిచయం చేశారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ప్రశంసించి సత్కరించారు.

# మహనీయుల సేవలు చిరస్మరణీయుల్లు : కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల :** మహనీయుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కొనియాడారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు ఉద్యమ సాయుధ దశలో చేసిన పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జయరాజ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జువ్వాడి జన్మదిన సందర్భంగా రక్తదానం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలమా కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు జన్మదిన సందర్భంగా సిరిపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం లక్ష్మి రెడ్డి శనివారం రక్తదానం చేశారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి నర్సింగరావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడం సంతోషాన్నిస్తుంది

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి సేవ చేయడం తనకి ఎంతో సంతోషాన్ని ఇస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.ఈ సందర్భంగా శనివారం మండలంలో 12 గ్రామాలలో పర్యటించి 36 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఒక్కొక్కరికి నేరుగా లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి చెక్కులను అందించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.36 మంది లబ్ధిదారులకు గాను 11,52,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెంట మండల బి ఆర్ ఎస్ నాయకులు,ఆయా గ్రామాల సర్పంచులు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/బీర్పూర్ :** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు సీజనల్ మరియు అంటువ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ఈ సమన్వయ సమావేశంలో మండల పరిధిలోని అందరూ సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు, మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు పాల్గొని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గ్రామాలలోని వీధులలో ట్రాక్టర్ తో నిరంతరం చెత్త సేకరణ ,డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలని, ఇండ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసి దోమల వ్యాప్తిని అరికట్టాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలని, గ్రామాలలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు నిరంతరం ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది,ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

# 51 శాతం ఫిట్మెంట్ ను ప్రకటించాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** పీఆర్సి రిపోర్టును ప్రభుత్వం తెప్పించి 51% ఫిట్మెంట్ ను వెంటనే ప్రకటించాలని కోరుతూ తపస్ రాష్ట్ర శాఖ ఆదేశానుసారం మండలశాఖ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు.అదేవిధంగా సిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని,2003 డీఎస్సి వారికి పాత పెన్షన్ విధానాన్ని కల్పించాలని,బకాయి పడ్డ ఆరు డీఏలను వెంటనే ప్రకటించాలని వినతిపత్రం ద్వారా కోరారు.కేజీబీవీ ఉద్యోగులకు ఎంటిఎస్ స్కేలు వర్తింపజేయాలని, మోడల్ స్కూల్ ఉద్యోగులకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలని,ఉపాధ్యాయులకు ప్రమోషన్లు బదిలీలకు సంబంధించి వార్షిక క్యాలెండర్ ను రూపొందించి అమలు చేయాలని తపస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తపస్‌మండల అధ్యక్షులు బోరపురెడ్డి శ్రీనివాసరావు, జిల్లా బాధ్యులు బండి మహేష్,కాశెట్టి రమేష్,బొక్కశెట్టి రవీందర్, ద్యావనపల్లి విష్ణు ,శీలం రాజేష్, బండి ప్రవీణ్, కనపర్తి సంతోష్,కాశెట్టి శ్రీనివాస్, బుగ్గారపు హరీష్, కాశెట్టి వెంకటరమణ, గొల్లపెల్లి రాజేశ్వర్, సందుపట్ల రమేష్ , చల్ల కృష్ణ, అప్సర్, పోచన్న, రఘు, తదితరులు పాల్గొన్నారు?

# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

**ప్రజాపక్షం/ధర్మపురి :** అంతర్ రాష్ట్ర దొంగను శనివారం ధర్మపురి పోలీసులు అరెస్ట్ చేశారు.ఎస్సై జి.మహేష్ వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో 2024 నవంబర్ లో ఏలేటి లక్ష్మణ్ నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు,వెండి ఆభరణాలను అపహరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీ,సాంకేతిక సమాచారాలతోపాటు పలువురిని విచారించగా నిందితులు స్థానిక బిర్యానీ సెంటర్లో పనిచేసి అనంతరం తమ రాష్ట్రం ఒడిషాకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో సీఐ రాం నర్సింహారెడ్డి,ఎస్సై జి.మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఒడిశా రాష్ట్రానికి వెళ్లి నిందితుడు రెహ్యాన్ బాక్స్ (30) ను అదుపులోకి తీసుకుని కేసుకు సంబంధించిన వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు అనంతరం ట్రాన్సిట్ రిమాండ్ పై ధర్మపురికి తీసుకువచ్చి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉండగా గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సైలు మహేష్,మిర్యాల రవీందర్,కానిస్టేబుళ్లు రణధీర్,కిరణ్ లను ఎస్పీ,డీఎస్పీ లు అభినందించారు.

# ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి రైతుల ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80 వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడుగా చరిత్రలో నిలిచారని అన్నారు.భూస్వామ్య దోపిడి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆయన త్యాగం ధైర్య సాహసాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.సమాజంలో సమానత్వం సామాజిక న్యాయం కోసం చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు .దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాసేవకు అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉంది అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కాంపల్లి హన్మాండ్లు,మాజీ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ మారంపెల్లి బాబు,మాజీ ఉపసర్పంచ్ మారం రాజశేఖర్ ,మాజీ సర్పంచ్ కాల్వ రాజయ్య,ఆవుల వెంకటేష్ యాదవ్, గణేష్, శ్రీనివాస్, రాము, రత్నం, అనిల్ రెడ్డి, పాల్గొన్నారు.



# మామిడి తోటల నిర్వహణపై ప్రత్యేక అవగాహన

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లె (ఇబ్రహీం నగర్) గ్రామంలోని రైతు వేదికలో ఈనెల 6 సోమవారం ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నారు .కార్యక్రమంలో శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ప్రొఫెసర్ ,రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్ పాల్గొని మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపు,నీటి యాజమాన్యం,ఎరువుల యాజమాన్యం, పురుగు, వ్యాధుల నివారణ ,మందుల పిచికారి,నీటి యాజమాన్య పద్ధతులు ,కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు,మార్కెటింగ్ మరియు ఇతర సాంకేతిక సూచనలు గురించి అవగాహన కల్పిస్తారు .కావున ధర్మపురి నియోజకవర్గంలోని మామిడి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని మామిడి తోటలో చేయవలసిన మెలకువలను నేర్చుకొని లబ్ధి పొందాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ అధికారి లత కోరారు.ధర్మపురి డివిజన్లోని గొల్లపల్లి మండల రైతులు తప్పకుండా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి అర్చన,ఉద్యాన విస్తరణ అధికారి వంశీకృష్ణ తెలిపారు.

# రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడా శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగారావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,మాజీ ఎంపీపీలు,మాజీ జెడ్పిటీసీలు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మండల సర్పంచులు, ఉపసర్పంచులు,వార్డు మెంబర్లు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీ లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేరం చేస్తే శిక్షించే హక్కు నీకు ఎక్కడిది ?

**ప్రజాపక్షం/మల్లాపూర్:** రాఘవపేట గ్రామంలోని ఓ వ్యక్తికి చెందిన గొర్రెపోతు దొంగతనం కేసులో దళిత కులానికి చెందిన నరసయ్య అనే వ్యక్తిని అనుమానంతో పట్టుకుని హమానుషంగా మల్లాపూర్ ఎస్సై దాడి చేశాడని సోషల్ మీడియా వేదికగా రఘువీర్ దయ్య అనే యువకుడు ప్రశ్నించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్ గా మారింది. మల్లాపూర్ ఎస్సై పోలీస్ వ్యవస్థకు మచ్చ తెచ్చేలా విధులు నిర్వర్తిస్తున్నాడని,తప్పు చేయకున్నా దళిత ఉప కులానికి చెందిన నరసయ్య అనే వ్యక్తిని పట్టుకుని లాటికి పని చెప్పి నానా ఇబ్బందులు గురి చేసి దుర్భాషలాడాడని, నేరం చేస్తే కేసులు నమోదు చేసి చట్టం ముందు నిలబెట్టాలని అంతేకానీ చట్టాన్ని చేతిలోకి తీసుకుని అన్నీ తానై పట్టుకున్న వ్యక్తిని హింసించి శిక్షించే హక్కు నీకు ఎక్కడిది అంటూ మాట్లాడాడు. ప్రజల్లో పోలీసులంటే గౌరవం ఉందని, సామాన్య ప్రజలపై అకారణంగా దాడి చేసి దుర్భాషలాడే మల్లాపూర్ ఎస్సై లాంటి వారి తీరు వల్ల పోలీసులంటే చులకన భావం కలిగి పోలీస్ వ్యవస్థ తలదించుకునే పరిస్థితి వచ్చిందంటూ ఘాటుగానే చురకలంటించాడు. దళిత ఉపకులానికి చెందిన వ్యక్తికి జరిగిన అన్యాయంపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోకుంటే దళిత కులస్తులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

# చీకటిపై గెలిచిన 'చూపు'..ఊరంతా పండుగ వెలుగు..!

కరీంనగర్ ఆసుపత్రి నుంచి సురక్షితంగా భీమ్ రాజు పల్లికి చేరిన 38 మంది బాధితులు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** నిన్నటివరకు వారి కళ్లల్లో ఏదో తెలియని ఆవేదన..వయసు పైబడటంతో కంటిచూపు మందగించి పక్కవారిపై ఆధారపడాల్సిన దీనస్థితి. కానీ నేడు వారి కళ్లల్లో సరికొత్త వెలుగు..ముఖాల్లో ఆనంద బాష్పాలు. లయన్స్ క్లబ్ రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్తంగా అందించిన ఉచిత వైద్య సేవలతో చీకట్లను తరిమికొట్టి సరికొత్త చూపుతో 38 మంది రోగులు సురక్షితంగా తమ స్వగ్రామమైన భీమ్‌రాజ్‌పల్లికి రెండు రోజుల అనంతరం శనివారం చేరుకున్నారు.గురువారం భీమ్రాజు పల్లి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి అదే రోజు కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఉచితంగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ 38 మంది లబ్ధిదారులను శనివారం లయన్స్ క్లబ్ ప్రత్యేక బస్సులో నేరుగా వారి గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామంలోకి అడుగుపెట్టిన వీరికి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, పెద్దలు ఘనంగా భావోద్వేగాల మధ్య స్వాగతం పలికారు. పైసా ఖర్చు లేకుండా కంటి వెలుగును తిరిగి ప్రసాదించిన వైద్యులకు, లయన్స్ క్లబ్ సభ్యులకు లబ్ధిదారులు వారి కు టు ంబ సభ్యులు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు. దేవుడు క ళ్లు ఇస్తే.. లయన్స్ క్లబ్ వారు చూపునిచ్చారు!.. వయసు పె రిగేకొద్దీ చూపు తగ్గిపోయి చాలా ఇబ్బంది పడ్డాను. ఆపరేషన్ చేయించుకునే స్తోమత మాకు లేదు. కానీ లయన్స్ క్లబ్ వారు దేవుడిలా వచ్చి మాకు ఉచితంగా ఆపరేషన్ చేయించి మళ్లీ ఈ ప్రపంచాన్ని చూసే భాగ్యం కల్పించారు. మా జీవితాంతం వీరికి రుణపడి ఉంటాం అని ఆపరేషన్ చేయించుకున్న ఓ వృద్ధుడు కళ్లవెంట ఆనంద బాష్పాలు రాల్చుతూ భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మహాకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ల సురేష్, లీడ్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ తాడూరి శ్రీనివాస ఆచార్య, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ తమ సేవలను అందించారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సింగారపు దొంగయ్య, లచ్చయ్య,సత్తయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బొమ్మన నరేందర్, మల్టీపర్పస్ వర్కర్ కంది గం గాధర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని వి జయవంతం చేశారు. భీమ్ రాజు పల్లి లక్ష్మీ పూర్, చందోలి, గొల్లపల్లి గ్రా మాలకు చెందిన 38 మందికి ఉచితంగా చూపునిచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన లయన్స్ క్లబ్ ఉదారతపై మండల వ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.

## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం / కాసిపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని కాసిపేట మండలం తాటిగూడ గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ తెలిపారు. తాటిగూడ గ్రామ పంచాయతీలో శనివారం ఆయన అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా పేదరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన గ్రామం, పిల్లలకు అనుకూల వాతావరణం, తాగునీటి సౌకర్యాల మెరుగుదల, స్వచ్ఛమైన–పచ్చని గ్రామం, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, పారదర్శక పరిపాలన, మహిళల భద్రత, సాధికారత వంటి తొమ్మిది ప్రధాన అంశాల ఆధారంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు గ్రామ ప్రజలు, యువత, మహిళలు, వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాలు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామ సభలో ఉపసర్పంచ్ తమ్మినేడి విజయలక్ష్మి, శ్యామ్ శేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, వార్డు సభ్యులు మడావి దేవు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధి రొడ్డ పద్మ, గ్రామస్థులు బుర్ర ప్రకాష్ గౌడ్, మడావి రాజేష్, నేరెళ్ల నర్సింహం, సిడం అర్జున్, మడావి రాము, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం / కౌటాల :** కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన చిన్నారి రియన్ష్ మృతి నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సూచన మేరకు శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గోరంట్ల సంతోష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 73 వేల రూపాయల విరాళాలు సేకరించి అందించారు. అలాగే కోనేరు కోనప్ప తరఫున 20 వేల రూపాయల వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. గుడ్లబోరి సర్పంచ్ పెద్ది మంగ, ఉప సర్పంచ్ మదునయ్య పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ దుకాణాల అక్రమాలపై విచారణ జరపాలి



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల ధరల విషయంలో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్పెల్లి జైరామ్ డిమాండ్ చేశారు. ఎరువుల కొనుగోలు సమయంలో రైతులకు నగదు లేదా చెక్కు రూపంలో కొంత మొత్తం తగ్గించి ఇచ్చినట్లు చూపిస్తూ, బిల్లుపై మాత్రం పూర్తి ధర నమోదు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆరోపించారు. వ్యవసాయ సీజన్‌లో అమాయక రైతులు వ్యాపార లెక్కలు తెలియక అధిక ధరలు చెల్లించి అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా, పత్తి విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాల యూనియన్ నాయకత్వంలోని ఒక వ్యాపారిని మీడియా ప్రతినిధులు వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ, పాత్రికేయుల పేర్లను డైరీలో నమోదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వ్యాపారం పారదర్శకంగా ఉంటే పేర్లు ఎందుకు నమోదు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఒకరి పేరుతో లైసెన్స్ పొంది ఇతరులు రెండు మూడు షాపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ, లీగల్ మెట్రాలజీ, వాణిజ్య పన్నుల శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బాలకార్మికులు లేని సమాజం ఏర్పడాలి

### బాలల హక్కుల ప్రజా వేదిక

### రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** బాలకార్మికులు లేని సమాజం కోసం అన్ని వర్గాల ప్రజలు ముందడుగు వేయాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి శనివారం ఆయన వచ్చిన సందర్భంగా విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బాలకార్మిక వ్యవస్థ నియంత్రణ జరిగితేనే బాలకార్మికులు లేని సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య పెరుగుతూనే ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే ఈ వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. బాలకార్మికులను గుర్తించి వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రతి పౌరుడు ఇందుకు బాధ్యతగా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్రవ్యాప్తంగా బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం రెండు దశాబ్దాలుగా కృషి చేస్తోందని తెలిపారు. బాలకార్మికులతో ఎవరైనా పనులు చేయిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు తక్షణమే పాఠ్యపుస్తకాలను అందించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా వసతి గృహాల్లోని విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేయాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల ప్రజా వేదిక ఉత్తర తెలంగాణ ఇన్చార్జ్ బూట్ల శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఇన్చార్జ్ బైరి చంద్రశేఖర్ స్వామి పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై నిషేధాజ్ఞల కొనసాగింపు

### పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



**ప్రజాపక్షం / మంచిర్యాల :** సాధారణ ప్రజలు, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిషేధాజ్ఞలు ఆగస్టు 1 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో డీజే సౌండ్స్, అనుమతి లేని డ్రోన్ల వినియోగంపై కూడా నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు, చిన్నారులు, వృద్ధులు, రోగులకు అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమాలకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమల్లో ఉంటుందని, అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. బంద్‌ల పేరుతో వ్యాపార సంస్థలను బలవంతంగా మూసివేయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# నిర్ణీత గడువులోపు ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలి



**ప్రజాపక్షం / జన్నారం :** అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారంను పూర్తిగా నింపి ఈ నెల 24వ తేదీలోపు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్‌కు సమర్పించాలని జన్నారం తహసీల్దార్ బక్కయ్య సూచించారు. జన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గడువులోగా ఫారం సమర్పించని వారి పేర్లు జూలై 31న ప్రచురించనున్న ముసాయిదా ఓటరు జాబితాలో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల ప్రతి అర్హ ఓటరు నిర్ణీత గడువులోపు తమ వివరాలను నమోదు చేసుకుని ఓటరు జాబితాలో పేరు ఉండేలా చూసుకోవాలని అవగాహన కల్పించారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో ఉమర్ షరీఫ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వెంకటేశ్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు), వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌పి3 గనిలో ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిఎం



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి3 గనిని శనివారం ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సందర్శించారు. గనిలోకి వెళ్లి వివిధ పని ప్రదేశాలను తనిఖీ చేసిన ఆయన ఇటీవల ఐదో సీమ్‌లో ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పనులు ప్రారంభించే ముందు అన్ని రకాల రక్షణ చర్యలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అంతకుముందు గని ఏజెంట్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశమై గని ఉత్పత్తి, ఉత్పాదకత, నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉద్యోగి నిబంధనలకు కట్టుబడి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. గనుల్లో సురక్షితమైన పని వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు వివిధ అంశాలపై పోలీసు కళాబృందం అవగాహన



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నితిక పంత్ ఆదేశాల మేరకు పెంచికల్పేట్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రాంగణంలో శనివారం జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృంద సభ్యులు సాంస్కృతిక ప్రదర్శనల రూపంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాల్యవివాహాల ముప్పులు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వీటితో పాటు చట్టం, శాంతిభద్రతలు, మహిళల భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు 1930, 100, 1098 వినియోగం వంటి ముఖ్యాంశాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతలో చట్టం, భద్రత, జాగ్రత్తలపై మరింత అవగాహన పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కళాబృందం సభ్యులు తెలిపారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కవిత, కళాబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, స్థానిక పోలీస్ కానిస్టేబుల్ రాజేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఎపి వినియోగంపై వన్ డే వర్క్ షాప్

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** బెల్లంపల్లి రీజియన్ లోని క్వాలిటీ విభాగం అధికారులు, ల్యాబ్ ఇన్‌ఛార్జ్‌లు, సిబ్బందికి శనివారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఒక్కరోజు ఎస్ఎపి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జిఎం వీరభద్రరావు అధ్యక్షతన ఈ వర్క్‌షాప్ జరిగింది. వీటితో పాటు క్వాలిటీ వ్యవహారాలకు సంబంధించి ఎస్ఎపి ని సంపూర్ణంగా ఎలా సద్వినియోగపరుచుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ విభాగం నుండి రవి కుమార్, అనుదీప్, శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ ఇన్‌ఛార్జ్ మురళీ కృష్ణ, బెల్లంపల్లి క్వాలిటీ ఇన్‌ఛార్జ్ రాజేష్, మందమర్రి క్వాలిటీ ఇన్‌ఛార్జ్ ప్రదీప్, క్వాలిటీ ల్యాబ్ ఇన్‌ఛార్జ్ మోహన్, మూడు ఏరియాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

## సమన్వయకర్త రామ కళ్యాణి



**ప్రజాపక్షం / నస్పూర్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థచే నడుపబడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపులలో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి ఈ నెల 6వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సంస్థ సమన్వయకర్త రామ కళ్యాణి తెలిపారు. శనివారం ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని బెల్లంపల్లి, సిఓఈ జైపూర్, మంచిర్యాల, కాసిపేట బాలుర కళాశాలలు, అలాగే లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లి బాలికల కళాశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన బాలికలు లక్షెట్టిపేటలోని గురుకుల కళాశాలలో, బాలురు జైపూర్ లోని గురుకుల కళాశాలలో ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకలు ప్రతులతో హాజరుకావాలని సూచించారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తుల రిజిస్ట్రేషన్, మధ్యాహ్నం 1 గంటకు మెరిట్ జాబితా ప్రకటన, 2 గంటల తర్వాత కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారని వివరించారు.మార్చి 2026 పదో తరగతి పరీక్షల్లో ఒకే ప్రయత్నంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దీనికి అర్హులని తెలిపారు. మార్కుల మెరిట్, కుల ప్రాతిపదికన అడ్మిషన్లు ఉంటాయన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో 2 లక్షల రూపాయలు, గ్రామీణ ప్రాంతంలో 1.50 లక్షల రూపాయల లోపు ఉండి, తహశీల్దార్ జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని పేర్కొన్నారు. వయస్సు ఆగస్టు 31, 2026 నాటికి 17 సంవత్సరాలు మించకూడదని, ఎస్సీ అభ్యర్థులకు ఏడాది సడలింపు ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, అడ్మిషన్ పొందిన వారు ఈ నెల 10వ తేదీ నాటికి ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించని యెడల సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య



**ప్రజాపక్షం / హాజీపూర్ :** ఎల్లంపల్లి పరిధిలోని నీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య ఆదేశించారు. ఎల్లంపల్లి సెగ్మెంట్ గుడిపేట నీటి శుద్ధి కేంద్రాన్ని శనివారం ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించేందుకు వీలుగా అధికారులు ఫిల్ట్రేషన్, క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలు, పంపింగ్ వ్యవస్థ, నిల్వ సామర్థ్యం, విద్యుత్ సరఫరాపై సమగ్ర చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి యంత్రాల నిర్వహణ, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందేలా అన్ని ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వివిధ ఏజెన్సీల ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నియామక విధానం, హాజరు, వేతనాల చెల్లింపులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ ఎంబీ ఈఈ కె మధుసూదన్, హాజీపూర్ తహసీల్దార్ పుష్పలత, డీఈఈ, ఏఈఈలు, ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలని తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/ముప్కాల్ :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ తహసీల్దార్ ముంతాజుబుద్దీన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పీఆర్సీ, డీఏలు పెండింగ్ బిల్లులపై ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా దశలవారిగా ఉద్యమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంల అధ్యక్షులు సుంకం రవికుమార్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ మధుసూదన్, ఉపాధ్యాయులు సునీతకుమారి, విజయానంద్, రామకృష్ణ, అనసూయ, రాజేందర్, ప్రసాద్, ఓంప్రకాస్ పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర సమావేశం సిఐటియు కార్యాలయంలో నిర్వహించటంజరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.సుధాకర్ హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు వెంటనే రెండవ పీఆర్సీని ప్రకటించాలని అందులో భాగంగా మున్సిపల్ కార్మికులందరికి 26 వేల వేతనం నిర్ణయించాలని కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు రేన్ కోట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపట్ల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సిఎం దృష్టి పెట్టాలని లేని యెడల రాష్ట్ర ఆందోళన ఇప్పటికే నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం ఇదే విధానం కొనసాగిస్తే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సిద్ధపడాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకనుగుణంగా కార్మికులను పెంచాలని, ఫిట్‌నెస్ లేని, లైసెన్స్ లేని, ఇన్సూరెన్స్ లేని బండ్లను నడపరాదని దానికి మున్సిపల్ యాజమాన్యం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వ దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం నిజామాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర కమిటీని ఎన్నుకున్నామన్నారు. మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎ.రమేష్‌బాబు, అధ్యక్షులుగా కె.భూపతి, ఉపాధ్యక్షులుగా బి.మహేష్, సూర రవి, వసంత, సహాయ కార్యదర్శిగా రాకేష్, అమూల్ దశరథ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నరేష్, ప్రచార కార్యదర్శిగా మోహన్‌లతో పాటు కమిటీ సభ్యులుగా మరో 9 మందిని ఎన్నుకున్నామన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో శనివారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులు బొంత లక్ష్మణ్‌కు 52 వేలు అందజేశామన్నారు. డీసీసీ డెలిగేట్ తమ్మె కపిల్‌కుమార్, గ్రామ అధ్యక్షులు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి అరుట్ల రమేష్, మండల ఉపాధ్యక్షులు రాజలింగం, సీనియర్ నాయకులు హన్మంతు, లక్ష్మీ నారాయణ, ప్రసాద్, నవీన్, మహేందర్ పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

**ప్రజాపక్షం/మాక్లూర్ :** సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు ఏసీపీ మస్తాన్‌అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ బృందం చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా శనివారం నందిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గెస్ట్‌హౌస్‌పై విశ్వసనీయ సమాచారంతో ఆకస్మిక దాడి నిర్వహించగా పేకాటాడుతున్న 10 మంది ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.58490 నగదు, 10 సెల్ ఫోన్లు 5 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌పోన్లు, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నందిపేట్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ జిల్లా కమీషనరేట్ పరిధిలో పేకాట, జూదం, గుట్కా, మత్తు పదార్థాల విక్రయాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారముంటే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా పోలీసు శాఖకు తెలియజేయాలని సమాచారమందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడుతాయన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.



# ఎప్పీవో సభ్యత్వాలు పెంచడమే లక్ష్యం

## సొసైటి చైర్మన్ మిద్దె నరేందర్



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని జాన్కంపేట్ సహకార సంఘం కార్యాలయంలో 104వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సోసైటీ ఛైర్మన్ మిద్దె నరేందర్ మాట్లాడుతూ.. సోసైటీ పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యత్వాలను పెద్ద ఎత్తున పెంచాలని పిలుపునిచ్చారు. ఎప్పీవోల ద్వారా సోసైటీ బలోపేతం కావడమే కాకుండా, రైతులకు చేకూరే ఆర్థిక ప్రయోజనాలు, రాయితీల గురించి ఆయన వివరంగా వివరించారు. రైతులందరూ తమ క్రాప్ లోన్లను సకాలంలో రెన్యూవల్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని పొందవచ్చని ఛైర్మన్ సూచించారు. సోసైటీ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పెస్టిసైడ్స్ విక్రయాలు, ఇతర నూతన వ్యాపార అవకాశాలపై రైతులతో చర్చించారు. సోసైటీ అందించే సేవలను గ్రామ రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సహకార సంఘం డైరెక్టర్లు, సోసైటీ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన సదస్సు. ప్లేట్లు గ్లాసుల పంపిణీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతులకు చెందిన 180మంది విద్యార్థులకు ఎడపల్లి సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా డీసీ నర్సయ్య, గంగారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి తరపున 50మంది విద్యార్థులకు ఉచితంగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయ బృందంతో పాటు పుష్పలత, మెర్సీ సీనియర్ సిటిజన్ల ఫోరం అధ్యక్షుడు మురారి, అంబయ్య, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రప్రకాష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వేకు రైతులు సహకరించాలి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులందరూ పూర్తిగా సహకరించాలని తహసీల్దార్ దత్తాత్రి కోరారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన పోచారం గ్రామంలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ నీరడి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సభకు తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారూ. భూ భారతి సర్వేలో భాగంగా అధికారులు మొదట గ్రామ సరిహద్దులను గుర్తిస్తారన్నారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖాలు మొదలైన వాటిని నిర్ధారిస్తారని తెలిపారు.

# 58 సంవత్సరాలు దాటిన హమాలీలకు లైసెన్స్‌లు పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 58 సంవత్సరాలు దాటిని హమాలీలకు లైసెన్స్‌లు పునరుద్ధరించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.హన్మాండ్లు మంత్రి సీతక్కను కలిసి విన్నవించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి హన్మాండ్లు వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ ఎఐటియుసి కూరగాయల వర్తకులు, ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో కార్మికులకు 58 సంవత్సరాలు దాటిన హమాలీలకు లైసెన్స్‌లు పునరుద్ధరించాలని కోరారు. 5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కూరగాయల కర్షకులకు మార్కెట్ యార్డులో మడిగెలను కేటాయించాలని కోరారు. కార్మికులందరికి పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు గోవర్ధన్ ప్రసాద్, అంజయ్య, నరేష్, సత్యనారాయణ, వెంకటేష కార్మికులు పాల్గొన్నారు.



# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య

### సిపిఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి

### ఘనంగా దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భూమి కోసం బుక్కి కోసం వెట్టిచాకిరి నుండి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని సిరిసిల్ల పట్టణ సిపిఐ కార్యదర్శి పంతం రవి అన్నారు. శనివారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 80 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నిజాం నవాబ్ రజాకార్ల పాలనలో తెలంగాణ ప్రాంతంలో దొరలు భూస్వాములు దేశ్ముకులు చేస్తున్న ఆగడాలపై ఆంధ్ర మహాసభ నాయకులు ఇచ్చిన పిలుపుతో చైతన్యవంతమైన వరంగల్ జిల్లా కడివెండి గ్రామంలో చైతన్యవంతమైన యువకులు శాంతియుతంగా సమావేశం నిర్వహిస్తుంటే ఆ సమావేశంపై తుపాకులతో వీరుచుపడ్డ విసునూరు దేశముకు గుండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమరయ్య అమరుడు అయ్యారన్నారు. దీనితో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని వీటికి వ్యతిరేకంగా పోరాడమే దొడ్డి కొమరయ్యకు మనం ఇచ్చే ఘనమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోమ నాగరాజు, ఎలగందుల రాజు, కొంక విజయ్, కాద రమేష్, సదానందం పాల్గొన్నారు.

## వీసా ఇప్పిస్తామని మోసం..వ్యక్తి అరెస్టు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన చెట్పల్లి శ్రీనివాస్ దుబాయ్ పంపిస్తానని తిమ్మాపూర్ కు చెందిన పాముల సతీష్ను నమ్మించాడు.దుబాయ్ వీసా ఉందని ఖర్చులకు 30 వేలు తీసుకుని వీసా ఇవ్వకుండానే డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుని భార్య పాముల చైతన్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు విచారించి అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్కు తరలించారు.

## తోడేటి పవిత్రను డిహెచ్ పిఎస్ నుండి తొలగింపు

### డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** డిహెచ్ పిఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శిగా ఉన్న తోడేటి పవిత్ర సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సంఘం గౌరవం, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన విషయాన్ని సంస్థ తీవ్రంగా పరిగణిస్తూ డిహెచ్ పిఎస్ నుండి తొలగించడం జరుగుతుందని డిహెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో డిహెచ్ పి ఎస్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం గజ్జల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్ లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం మేరకు తోడేటి పవిత్రను డి హెచ్ పి ఎస్ సంస్థలోని అన్ని బాధ్యతల నుండి, అలాగే సంస్థ ప్రాథమిక సభ్యత్వం నుండి తక్షణమే తొలగించడం జరిగిందన్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని, ఇకపై ఆమెకు డిహెచ్ పిఎస్ సంస్థతో ఎలాంటి అధికారిక సంబంధం లేదని సంస్థ తరపున వెల్లడించారు.

# పంట మార్పిడి, ఆయిల్ పామ్ సాగును విస్తరించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

### హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులను చైతన్యపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్లోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయం, ఎరువుల లభ్యత, ఫార్మర్ రిజిస్ట్రీ, కాలానుగుణ వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2026–27 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధనకు జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పంట మార్పిడి విధానాలను విస్తృతంగా అమలు చేయడంతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయానికి అవసరమైన యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు రైతులకు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎరువుల అక్రమ రవాణా, పక్కదారి పట్టించడం వంటి చర్యలను కఠినంగా అరికట్టాలని, జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం నమోదుతో మొదటి స్థానంలో ఉందని పేర్కొంటూ, ఈ పురోగతిని కొనసాగించాలని అధికారులను కోరారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా



వైద్య, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ చర్యలు, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, పశుసంవర్ధక, పంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని లక్ష్మీనగర్ షాపింగ్ ఏరియాలో షార్ట్ సర్క్యూట్ తో శుక్రవారం అర్ధరాత్రి వాసవి కొబ్బరికాయలు & పూజా సామాగ్రి షాపులో జరిగిన ప్రమాదంలో 15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని,బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ డిమాండ్ చేశారు. శనివారం రోజున అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి 15 లక్షలు నష్టపరిహారం ఇప్పించాలని.లక్ష్మీ నగర్ షాప్ లకు ఇన్సూరెన్స్ చేయాలని.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన విధంగా షాప్స్ ప్రక్కన వేసిన కరెంట్ పోల్స్ ను తీసివేయాలనీ,అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయిందని,వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.లక్ష్మీ నగర్ లోని ప్రతి షాప్ కి ఇన్సూరెన్స్ చేయాలని, మున్సిపల్ ఎన్నికల సమయం లో హామీ ఇచ్చిన విధంగా ఇండ్ల ప్రక్కన వేసిన కరెంట్ స్తంభాలను తొలగించాలని మక్కాన్ సింగ్ ని కోరార్లు, మురళీధర్ మారుతి,కిరణ్, కృష్ణ లు పాల్గొన్నారు.

## రైతాంగ పోరాటానికి దొడ్డి కొమురయ్య త్యాగం స్ఫూర్తిదాయకం

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య పోరాటం తెలంగాణ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన త్యాగనిరతి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజ అభ్యున్నతి కోసం నిబద్ధ



తతో పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, బీసీ అభివృద్ధి శాఖ అధికారి సౌజన్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కురుమ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి రూ. 1.41 లక్షల విరాళం

**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి, విస్తరణ పనుల కోసం భారీ విరాళం అందింది. అమెరికాలో స్థిరపడిన వరంగల్ వాస్తవ్యులు జాట్లింగ్ కిరణ్ కుమార్, లక్ష్మి లావణ్య దంపతులు స్వామివారి ఆలయానికి రూ. 1,41,000 నగదును విరాళంగా అందజేశారు. శనివారం ఆలయానికి చేరుకున్న ప్రవాస భారతీయ దంపతులు రాజన్నను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవికి ఈ విరాళానికి సంబంధించిన నగదును వారు బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆ దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం అందించి, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వేములవాడ గురుకుల బాలికల కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆర్జేసీసెట్ (RJCCET) ప్రవేశాల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 6న జిల్లా స్థాయిలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని సీటు పొందని విద్యార్థినులు, అలాగే ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన విద్యార్థినులు సిరిసిల్ల బద్దెనపల్లి బాలికల జూనియర్ కళాశాల నందు జరిగే స్పాట్ కౌన్సెలింగ్లో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. కౌన్సెలింగ్కు హాజరయ్యే విద్యార్థినులు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్పోర్ట్ సైజు ఫోటోలు తదితర అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి. జ్యోతి కోరారు.

## పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి



ప్రజాపక్షం/రాయికల్ : ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే అందజేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులకు రావలసిన ఆరు డిఏ బకాయిలు,పి ఆర్ సి అమలు మరియు పెండింగ్ బకాయిలు తొందరగా విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అరుణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు చెరుకు మహేశ్వర శర్మ జిల్లా నాయకులు కె.రజనీకాంత్,వి.మధు మండల ప్రధాన కార్యదర్శి పుర్రె రమేష్, నాయకులు కె.రమేష్, శ్రీనివాస్,ఆర్ జయదేవ్ వర్మ,తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో వేగం పెంచాలి

### తహసీల్దార్ శ్రీనివాస్

ప్రజాపక్షం/నిజాంపేట్ : ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియలో వేగం పెంచాలని, పగడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. నిజాంపేట మండలం నందగోకుల్, నస్కల్, రాంపూర్ గ్రామాల్లో శనివారం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియ వేగం పెంచి, ఎన్నికల అధికారులు ఇచ్చిన గడువు లోపల ప్రక్రియను ముగించాలన్నారు. తప్పులు లేకుండా ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించాలన్నారు. బిఎల్ఓ అంతం జ్యోతి, బిఎల్ఏ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## ముక్కుపుడకను బాధిత మహిళకు అందించిన మున్సిపల్ డ్రైవర్

ప్రజాపక్షం /మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో నిజాయితీకి నిదర్శనంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని 4వ వార్డుకు చెందిన అంగిడి జల అనే మహిళకు చెందిన బంగారు ముక్కుపుడక అనుకోకుండా చెత్తలో పడిపోవడంతో, అది చెత్త సేకరణ ఆటోలో వెళ్లిపోయింది.విషయం తెలుసుకున్న మున్సిపల్ చెత్త సేకరణ ఆటో డ్రైవర్ కంపెల్లి రమేష్‌కు బాధితురాలు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన రమేష్ డంపింగ్ యార్డులోని చెత్త కుప్పల్లో వెతికి బంగారు ముక్కుపుడకను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.అనంతరం బాధితురాలు అంగిడి జలను మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్ ఆధ్వర్యంలో బంగారు ముక్కుపుడకను ఆమెకు అందజేశారు. డ్రైవర్ కంపెల్లి



రమేష్ చూపిన నిజాయితీని స్థానికులు, మున్సిపల్ అధికారులు,సహచర కార్మికులు అభినందించి ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల రాజ్‌కుమార్, జవాన్లు ముజీబ్, నరేష్, నిజాం, శేఖర్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్,శ్రీను,అనిల్,సంజీవ్,రాజగోపాల్,లక్ష్మీరాజం,కుమార్,రాజం,రాము,నర్సయ్య, పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో ఘనంగా జువ్వాడి నర్సింగరావు జన్మదిన సంబరాలు

ప్రజాపక్షం /మెట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలు మెట్‌పల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారుఈ సందర్భంగా మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు.అక్కడి నుంచి భారీ ర్యాలీగా మెట్‌పల్లి పట్టణంలోని వై కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులతో కలిసి మరోసారి కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించాలని పలువురు సూచించినప్పటికీ, కార్యకర్తల అభిప్రాయాన్ని గౌరవిస్తూ నియోజకవర్గంలోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువచ్చి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అమలులో కోరుట్ల నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందంజలో ఉందని నాయకులు పేర్కొన్నారు.జువ్వాడి నర్సింగరావు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానులు,కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి,కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మెట్‌పల్లి డివిజన్ పవర్ జెఏసి ఏర్పాటు

ప్రజాపక్షం /మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ పవర్ జేఏసీని శనివారం ఏర్పాటు చేశారు.డివిజన్ చైర్మన్‌గా మునుగురి లక్ష్మణ్, జనరల్ సెక్రటరీగా జరుపుల హరిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పవర్ జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, జిల్లా జనరల్ సెక్రటరీ రాంజీ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణ,సమస్యల పరిష్కారం కోసం పవర్ జేఏసీ కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.కమిటీ సభ్యులుగా వేణు,గోపాల్ రెడ్డి,సురేష్, రవీందర్, అనంతం, శ్రీనివాస్,శంకర్,నరహరి ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు నాయకులు,కార్మికులు అభినందిస్తూ, విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.



## మాజీ మంత్రి దయాకర్‌రావు సేవలు మరువలేనివి

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసిన సేవలు మరువలేనివని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు అన్నారు. శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో కంటి పరీక్షలు, చీకటాయపాలెం గ్రామంలో అన్నదానం, తొర్రూరు మున్సిపాలిటీలోని అన్నారం రోడ్డులో అల్పాహారం, పలు చోట్ల మహా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలే తన కుటుంబంగా భావించి ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచి కంటికి రెప్పలా కాపాడుకునే గొప్ప నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు అని అన్నారు. రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పసుమర్తి సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, తూర్పాటి చిన్న అంజయ్య, ఈదురు ఐలయ్య, ఎన్నమనేని శ్రీనివాస్, నలమాస ప్రమోద్, బిందు శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, కాలునాయక్, పేర్ల జంపన్న, తూర్పాటి రవి, చకిలేల మణిరాజ్, రాయిశెట్టి వెంకన్న, మేరుగు ప్రకాశ్, ముద్దం వీరారెడ్డి, రాయిశెట్టి యాకేందర్ మానస,శీలం లింగన్న, కడెం యాకయ్య, బాలునాయక్, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.



## పట్టణంలో దొంగల హల్‌చల్

### కిరాణా షాపులో,మైసమ్మ తల్లి దేవాలయంలో చోరీ



ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణంలోని ట్యాంక్ బండ్ సమీపంలో దొంగలు శుక్రవారం రోజు రాత్రి కట్ట మైసమ్మ ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు మరియు సమీపంలోని ఆర్కే కిరాణంలో నగదును మరియు కిరాణా సామాన్లు చోరీ చేశారు.దేవాలయ నిర్వాహకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్,మరియు ఆర్కే కిరాణా షాపు యజమాని రాకేష్ లు మాట్లాడుతూ శుక్రవారం రోజు రాత్రి గుర్తు తెలియని దొంగలు ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి అందులో ఉన్న సొమ్మును దోచుకెళ్లారని, కిరాణా షాపులో దాదాపు నగదు సామాన్ల విలువ 18 వేల వరకు దొంగిలించారని తెలిపారు.గతంలో కూడా ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ఇదే తరహా చోరీ జరిగిన విషయాన్ని గుర్తు చేస్తూ, పోలీసులు రాత్రివేళల్లో నిఘా మరింత పెంచాలని అన్నారు. వారి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి పోలీసులు తెలిపారు.

## మహనీయుల సేవలు చిరస్మరణీయం

### జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల: మహనీయుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కొనియాడారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు ఉద్యమ సాయుధ దశలో చేసిన పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జయరాజ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

ప్రజాపక్షం /మెట్‌పల్లి : మెట్‌పల్లి కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాటంలో దొడ్డి కొమరయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కురుమ సంఘం ప్రతినిధులు దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. వారి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కోట రమేష్, కురుమ సంఘం అధ్యక్షుడు కోరే రమేష్, కోట మహేష్, కోట నరసింహులు, కోట శ్రావణ్, కోట చిన్న నరసింహులు, కోరే మధు, సురేష్, రాజేందర్, భూమేష్ కుమార్, నాని, రమేష్, మనోజ్, వినయ్, జైపాల్, సంతోష్, ధర్మేందర్, ముద్దుల భాస్కర్, కోరే గంగాధర్‌తో పాటు కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

